క్లుప్తంగా

ఎస్ఎల్ గుడిపాడులో నేడు జగనన్న సురక్ష

బల్లికురవ: మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారంతా క్యాంపులకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

నేడు టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

పర్చూరు (చినగంజాం): మండలంలోని నూతలపాడు గ్రామంలో ఇంకొల్లు రోడ్‌లో నేడు తిరుమల తిరుపతి దేవస్థానం వారి కల్యాణ మండపం నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు భవనం రాజగోపాలరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక దాతల సహకారం, టీటీడీ నిధులతో బుధవారం ఉదయం 8 గంటలు నుంచి 11 గంటల మధ్య భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమం చేయనున్నారని భక్తుల, స్థానికులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

మార్టూరు ఎస్సైగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు, ఎస్సై

మార్టూరు: మార్టూరు నూతన ఎస్సైగా ఎం శ్రీనివాసరావు మంగళవారం ఉదయం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. మార్టూరు సీఐ ఎస్కే ఫిరోజ్, ఎస్సై కే కమలాకర్‌లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం రాత్రి వీఆర్‌కు పిలిపించారు. ఈ నేపథ్యంలో నూతన ఎస్సైగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.

భర్తపై భార్య బంధువుల దాడి

మార్టూరు: అనారోగ్యంతో ఉన్న ఓ వ్యక్తిపై అతడి భార్య ఆమె తరపు బంధువులు దాడి చేశారు. ఈఘటన సోమవారం మార్టూరులో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఆర్జేడీ కాలనీలో నివాసముంటున్న పాలపర్తి కోటేశ్వరరావు సోమవారం తన ఇంటిలో ఉండగా గత కొంతకాలంగా అతనికి దూరంగా ఉంటున్న భార్య, కుమార్తె అల్లుడు, అత్త తదితరులు విచక్షణా రహితంగా దాడి చేశారు. తలకు తీవ్రగాయమైన కోటేశ్వరరావును 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాధితుడు స్థానిక పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

50 ఏళ్లు పూర్తి చేసుకున్న వేణుగోపాలస్వామి భక్తి సమాజం


గాయకుడు ఎడ్వర్డ్ యాదవ్‌ను సత్కరిస్తున్న భజన సమాజం, గ్రామ పెద్దలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో వేణుగోపాలస్వామి భక్తి సమాజం 50 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈసందర్భంగా మంగళవారం గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తి సమాజం స్థాపించిన దగ్గరనుంచి ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాలు ఉడిపి, తిరుమల తిరుపతి, షిరిడి నందు ఎన్నో భక్తి కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు భక్తి కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పలు గ్రామాలలో భక్తి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తి సమాజంలో ప్రముఖ గాయకుడు పాలేరు ఎడ్వర్డ్ యాదవ్‌ను మంగళ వారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోరంట్ల సాంబశివరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పత్తిపాటి సత్యనారాయణ, చైర్మన్ చిన్న లక్ష్మీనారాయణ, దేవస్థాన అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, ఆశ్వీజ మాసం, శతభిష నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


జాగర్లమూడిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు


కారంచేడులో మంగళవారం రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు

పరాశక్తి లలితా.. శివానంద చరితా

- ఘనంగా విజయదశమి వేడుకలు
- ముగిసిన దసరా శరన్నవరాత్రులు
- కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

చీరాల అర్బన్/వేటపాలెం: దసరా నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటాయి. సోమ, మంగళవారాల్లో విజయదశమిని ప్రజలు ఆనందోత్సవాలతో మధ్య బంధుమిత్రుల మధ్య జరుపుకున్నారు. అమ్మవారి ఆలయాలను సందర్శించి ఆశీస్సులు తీసుకున్నారు. శమీవృక్ష ఆకులతో పెద్దల పాదాలకు నమస్కరించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ అలంకారాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీరాలలో పార్వేట ఉత్సవాన్ని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలోని ప్రాంగణంలో నిర్వహించారు. పట్టణంలోని పలు దేవాలయాలలో ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరించి శమీపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు.

రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు..

చినగంజాం/యద్దనపూడి/కారంచేడు/మార్టూరు: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చినగంజాం మండలంలోని పల్లెపాలెం గ్రామంలో అమ్మవారిని భక్తులు రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. సోపిరాల లలితా రామకోటేశ్వరాలయం, భవానీపురం విజయ కనకదుర్గా భవానీ ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు.

■ యద్దనపూడి మండలంలోని జాగర్లమూడిలోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయం చెరువులో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. పూనూరులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, త్రిపుర సుందరి సమేత త్రిపురాంతకస్వామి ఆలయాల్లో ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించి శమీవృక్ష పూజా కార్యక్రమం నిర్వహించారు.

■ కారంచేడు వైష్ణవీదుర్గాలయం, పెదబజారు శివాలయం, సాయిమందిరం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం గ్రామాల్లోను అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

వాడవాడలా విజయదశమి వేడుకలు..

బల్లికురవ/అద్దంకి రూరల్: విజదశమి వేడుకలు సోమ, మంగళవారాల్లో పట్టణంలో వాడవాలా ఘనంగా నిర్వహించారు. చెన్నుపల్లి గ్రామంలోని కోదండ రామాలయం, గంగాపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆయలంలోని అమ్మవార్లను మహిసాసురమర్దిని, రాజరాజేశ్వరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. కొండాయపాలెం, కొణిదెన, మల్లాయపాలెం గ్రామాల్లో కూడా దసరా శరన్నవరాత్రుల వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం వేడుకల ముగింపులో భాగంగా గ్రామోత్సవం చేపట్టారు.

■ అద్దంకి పట్టణంలోని వింధ్యావాసవి సమేత నగరేశ్వరస్వామి దేవస్థానం, నాంచారమ్మ దేవస్థానం, ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రం, షిర్డీ సాయిబాబా దేవస్థానం, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయాల్లోని అమ్మవార్లను మహిసాసుర మర్దిని, రాజరాజేశ్వరీ దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు.

కన్నుల పండువగా వేంకటేశుడి కల్యాణం..

వేటపాలెం గడియార స్తంభం సెంటర్‌లో గల రాజ్యలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణాన్ని మంగళవారం వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు స్తంభాల మందిరంపై స్వామివారిని ఉంచి పార్వేట మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో తెప్పోత్సవం నిర్వహించారు.


అద్దంకిలోని నగరేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు


చీరాల: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


వేటపాలెంలో విజయ వాసవీ దేవిగా కన్యకాపరమేశ్వరిగా..


కారంచేడులో మహిసాసురమర్దినిగా దర్శనిమిస్తున్న అమ్మవారు


చెన్నుపల్లిలో మహిసాసురమర్దినిగా అమ్మవారు


చెన్నుపల్లిలో రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు


చినగంజాంలో రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు


అద్దంకిలో మహిసాసురమర్దిని అలంకరణలో అమ్మవారు

ప్రతి నీటి బొట్టుకూ లెక్క తీస్తాం


బొబ్బేపల్లి సభలో ప్రసంగిస్తున్న ఆమంచి

- నీరు–చెట్టులో ఎమ్మెల్యే ఏలూరి అవినీతిపై ఆమంచి ధ్వజం
- వేయికి పైగా బైకులతో నియోజకవర్గంలో భారీ ర్యాలీ

మార్టూరు: గత ప్రభుత్వ హయాంలో నీరు–చెట్టు పథకం ద్వారా ఎమ్మెల్యే ఏలూరి చేసిన రూ. 150 కోట్ల అవినీతిలో ప్రతి రూపాయికి లెక్కలు తీసి ప్రజల ముందుంచుతానని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ధ్వజమెత్తారు. మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో టీడీపీ హయాంలో జరిగిన అవినీతి, అరాచకాలపై ఆయన నిప్పులు చెరిగారు. నీరు చెట్టు పథకం కింద 2014–19 మధ్య నియోజకవర్గంలో రూ.70 లక్షలు విలువైన వేల కొలది మొక్కలు నాటినట్లు రికార్డులు చూపారన్నారు. వాటిలో నేడు ఒక్క మొక్క కూడా కన్పించక పోవడంపై ఏలూరి ప్రజలకు సమాధానం చెప్పి తన జవాబుదారీతనాన్ని నిరూపించుకోవాలని సవాలు విసిరారు. ఆరు మండలాల్లో పలు గ్రామాల్లోని చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వడం ద్వారా ఏలూరి రూ.140 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆమంచి ఆరోపించారు. బొబ్బేపల్లి గ్రామంలోని చెరువును పరిశీలించానని, రెండు అడుగులు లోతు మట్టి తవ్వితే నీటి నిలువకు ఉపయోగపడే చెరువును ఏకంగా 20 అడుగుల లోతు తవ్వారని దానిని తిరిగి పూడ్చి వినియోగంలోకి తేవాలంటే రూ.10 కోట్ల ఖర్చు అవుతుందని ఆరోపించారు. దేవరపల్లిలో రైతులకు చెందిన చెరువులో 30 అడుగుల మేర మట్టి తవ్వి నాగులపాలెం చెరువులో పడి దళిత బాలుడు మృతి చెందాడని ఆమంచి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఏలూరి కనుసన్నల్లో జరిగిన అవినీతిని సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి విచారణ వేయించి నిజానిజాలు వెలికి తీసి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకాడబోమని ఆమంచి హెచ్చరించారు. అంతకుముందు బొబ్బేపల్లి గ్రామంలో నీరు చెట్టు పథకంలో జరిగిన అవకతవకలు పరిశీలించడానికి పర్చూరు నుండి బొబ్బేపల్లి వరకు బైకు ర్యాలీ ద్వారా బయలు దేరిన ఆమంచికి ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. మండలంలోని దేగరమూడి గ్రామంలో జగనన్న కాలనీలో గృహ ప్రవేశం నిర్వహించి హైవేపైకి వచ్చిన ఆమంచికి వేయికి పైగా ద్విచక్రవాహనాలుపై పార్టీ శ్రేణులు తరలి వచ్చారు. మాజీ సర్పంచ్ దండా వీరాంజనేయులు, ఎంపీటీసీ దండా హరిబాబు, టీ కోటేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు నియోజకవర్గంలోని నాయకులు ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు


మార్టూరులో బైక్ ర్యాలీ ప్రదర్శనగా వస్తున్న ఆమంచి, పార్టీ శ్రేణులు

కరణం వెంకటేష్‌కు పరామర్శల వెల్లువ


కరణం వెంకటేష్‌తో మాట్లాడుతున్న మంత్రి సురేష్


వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తూమాటి, మాజీ ఎమ్మెల్యే పోతుల

చీరాల టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్న చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను మంగళవారం పలువురు రాజకీయ పార్టీల నేతలు, పార్టీ నేతలు పరామర్శించారు. చీరాల మండలం బోయినవారిపాలెంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వెంకటేష్‌ను ఆటో ఢీకొట్టడంతో గాయపడిన విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు ఒంగోలులోని సంఘమిత్ర హాస్పిటల్లో చికిత్స అనంతరం శస్త్రచికిత్స కోసం వెంకటేష్ తండ్రి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వెంకటేష్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌బాబు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుంటుపల్లి హైమా సుబ్బారావు, పలువురు నాయకులు, తదితరులు పరామర్శించారు.

ప్రతిష్ట మహోత్సవాల్లో శాప్‌నెట్ చైర్మన్


పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

పంగులూరు: మండలంలోని రేణింగవరం గ్రామంలోని గంగమ్మ, పోలేరమ్మ, నాంచారమ్మ, పోతురాజు సహిత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల ప్రతిష్ఠామహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సొసైటీ అధ్యక్షుడు, సొసైటీ సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు సిద్ధం


ప్రతిష్టకు సంబంధించి ఏర్పాటు చేసిన అరుగు

బల్లికురవ: మండలంలోని పాతమల్లాయపాలెం బస్టాప్ వద్ద అభయాంజనేయస్వామి ప్రతిష్ట వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. గ్రామానికి చెందిన సింగం వెంకటనారాయణ శర్మ కుమారులు 5 సెంట్ల స్థలాన్ని ఉదారంగా ఇచ్చారు. ఈ స్థలంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దపాటి చంద్రశేఖరరావు సుమారు రూ. 20 లక్షలతో అభయాంజనేయస్వామిని శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రతిష్ఠించనున్నారు. రాసుపాలెం గ్రామానికి చెందిన ప్రతిష్టాచార్యులు ఐనవోలు సీతారామాచార్యులచే బుధవారం సాయంత్రం యాగశాల ప్రవేశంతో ప్రతిష్టకు అంకురార్పణ చేయనున్నారు. గురువారం అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ధాన్యాధి, జలాధి, క్షీరాధివాసంలో ఉంచి హోమాలు చేపట్టనున్నారు. శుక్రవారం రాత్రి గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, వార్‌సీన్, చింతామణి, దేవసర్తకి పూర్తి నాటకం ప్రదర్శిస్తున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. వేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కవిత్వానికి ఊపిరి 'కొత్త గొంతులు'

చీరాల అర్బన్: కవిత్వానికి ఊపిరి కొత్త గొంతులు అని ప్రముఖ కవి బీరం సుందరరావు అన్నారు. ఆదివారం అమెరికాలోని సిలికానాంధ్ర యూనివర్సిటీలో జరిగిన అమెరికా సాహిత్య సదస్సులో ఆయన కవిత్వంలో కొత్త గొంతులు అనే అంశంపై ప్రసంగించారు. సదస్సుకు కవియిత్రి కె.గీత అధ్యక్షత వహించారు. రెండు రోజులు పాటు జరిగిన సదస్సులో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ తదితర దేశాల నుండి సాహితీవేత్తలు ప్రసంగించారు. కొత్తతరం కవులు రాస్తున్న కవిత్వాలలో ప్రత్యేకతలను, వైవిధ్యాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

కారంచేడు: దసరా సెలవుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెలవులు మంగళవారంతో ముగిశాయి. దీంతో బుధవారం నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పటి మాదిరిగానే ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి పాఠశాలలు నిర్వహించాలని వారు ఉపాధ్యాయులకు సూచించారు.

కొమ్మమూరు ఆయకట్టుకు సాగునీరివ్వాలి

కారంచేడు: కొమ్మమూరు ఆయకట్టు కింద వరి సాగు చేసిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని, ఇప్పటికే సాగుచేసిన పంట చేలు బీడులు వారుతున్నందున కొమ్మమూరు కాలువకు సాగునీటి విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి డీ రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్‌లో రైతులతో మాట్లాడారు. కొమ్మమూరు కాలువ పరివాహక ప్రాంత రైతుల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తమ పంట భూములను కాపాడేలా అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని వారు ప్లకార్డులతో ర్యాలీ చేస్తూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

గిరిపుత్రులపై దాడి అమానుషం

బల్లికురవ: గిరిపుత్రులపై అఘాయిత్యాలకు పాల్పడి సాహిమూక అత్యాచారం చేసిన నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించాలని సీఎం రాష్ట్ర నాయకురాలు పీ. రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి మండలంలోని కూకట్లపల్లి గ్రామంలోని యానాది సంఘంలో గిరిపుత్రులతో ఆమె మాట్లాడారు. ఇటీవల తమిళనాడు రాష్ట్రం, ధర్మపురి జిల్లా వాచాతిలో జరిగిన ఘటనపై ఆమె మాట్లాడుతూ అక్కడ నిందితులకు శిక్ష పడేవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు.